క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పులివెందుల రూరల్ : పట్టణంలో శ్రీవెంకటేశ్వరస్వామి రథం ఊరేగింపు సందర్భంగా రథం వెళ్లే మార్గంలో బుధవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ జగదీశ్వరరెడ్డి తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలన్నారు.

వెట్టి చాకిరీని నిర్మూలిద్దాం



అవగాహన కార్యక్రమంలో జేసీ, తదితరులు

వేంపల్లె : వెట్టి చాకిరి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ తెలిపారు. మంగళవారం చిత్తూరు జిల్లాకు చెందిన రోప్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గ్రామాల్లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అందుకు సంబంధించిన పోస్టులను ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా వేంపల్లె మండలంలోని కుమ్మరాంపల్లె గ్రామంలో ఉన్న యానాది కాలనీ, నేలవరం తండాలలో నిర్వహించిన వెట్టి చాకిరి నిర్మూలిద్దాం, అక్రమ రవాణాను అరికడదాం అనే నినాదాలతో కళా మైత్రి కళా బృందం పాట, మాట ద్వారా ప్రజలను చైతన్యపరిచారు. కార్యక్రమంలో ఆర్డీఓ చిన్నయ్య, తహసీల్దార్ హరినాథ్‌రెడ్డి, ఆర్‌ఐ లోకేష్, సీఐ సురేష్‌రెడ్డి, ఎస్‌ఐ రంగారావు, కళా బృందం టీం లీడర్ వేమనారాయణ, పోలీసు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక పూజలు

పులివెందుల రూరల్ : మండలంలోని ఇ.కొత్తపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని మోట్నూతలపల్లె గ్రామ సమీపంలో వెలసిన స్వయంభు కోన గవేశ్వరస్వామి ఆలయంలో మాఘ పౌర్ణమి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆలయంలో గణపతిపూజ, పంచామృతాభిషేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కూలీల సంఖ్యను పెంచండి



ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కృష్ణమూర్తి

సింహాద్రిపురం : ఉపాధి హామీ పథకంలో భాగంగా జరుగుతున్న పనులలో ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. మంగళవారం మండలంలోని కోవరంగుంటపల్లెలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఉపాధి హామీ పనుల వివరాలను, సౌకర్యాలపై ఆరా తీశారు. ఉపాధి హామీ పనులలో ఎక్కువ మంది కూలీలు పాల్గొనేలా చూడాలన్నారు.

వాటర్‌షెడ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ముద్దనూరు : వాటర్‌షెడ్ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీవో రమాదేవి తెలిపారు. మంగళవారం మండలంలోని నల్లబల్లె గ్రామంలో వాటర్‌షెడ్ యాత్ర, అభివృద్ధి అమలుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ నీటి వినియోగం, చెట్లను కాపాడుకోవడం తదితర అంశాలపై అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వాటర్‌షెడ్ సిబ్బంది మద్దిలేటి, నరసింహులు, వైఎస్సార్ సీపీ నాయకులు రామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ విజేతలుగా ఎస్వీ డిగ్రీకాలేజి



ట్రోఫీ అందుకుంటున్న విద్యార్థులు

జమ్మలమడుగు : యోగివేమన యూనివర్సిటీ పరిధిలో జరిగిన బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జమ్మలమడుగుకు చెందిన ఎస్వీ డిగ్రీకాలేజి విద్యార్థులు విజేతలుగా నిలిచినట్లు కాలేజి కరస్పాండెంట్ పాల నాగేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక కాలేజిలో ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ స్థాయిలో కమలాపురంలోని సీఎస్ఎస్ఆర్, ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీకాలేజిలో పోటీలు జరిగాయి. ఈ పోటీలలో యూనివర్సిటీ పరిధిలోని అన్ని కాలేజిల క్రీడాకారులు పాల్గొన్నారు. ఫైనల్స్‌లో యూనివర్సిటీ టీం, సాయి పరమేశ్వర కాలేజి టీంకు పోటీ జరిగింది. ఈపోటీల్లో ఎస్వీ కాలేజి విజేతలు కావడంతో యూనివర్సిటీ ప్రిన్సిపాల్ రఘురాంరెడ్డి, యూనివర్సిటీ స్పోర్ట్స్ డైరెక్టర్ రామసుబ్బారెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు మెడల్స్ సర్టిఫికెట్లు, ట్రోఫీతోపాటు ఐదువేల నగదును అందించారన్నారు. కార్యక్రమంలో టీం కెప్టెన్ ప్రేమ్‌కుమార్, ఇతర క్రీడాకారులకు కాలేజి యాజమాన్యంతోపాటు అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

చీనీకి తెగులు.. రైతుకు దిగులు

- తెల్లపొడతో చీనీ చెట్లకు నష్టం
- పట్టించుకోని అధికారులు



తెల్లపొడ వ్యాప్తితో పీకివేసిన చీనీ చెట్లు



చీనీచెట్టుకు తెల్లగా పొడలాగా వున్న తెగులు

ముద్దనూరు : చీనీ చెట్లను తెల్లటి పొడ పట్టిపీడిస్తోంది. ఈ తెల్లటి పొడలాంటి తెగులుతో చెట్లు పూర్తిగా దెబ్బతింటుండటంతో రైతులు చెట్లను పొలాల్లో పీకివేస్తున్నారు. పలుమార్లు ఈ తెగులు గురించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా వారు స్పందించడంలేదని చీనీ రైతులు వాపోతున్నారు. కాయలు కాసి వాటిని పీకివేయడానికి సిద్ధంగా వున్న సమయానికి ఈ తెల్లపొడ తెగులుతో చీనీ చెట్లు పాడవుతున్నాయని, ఆర్థికంగా నష్టపోతున్నామని చీనీ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 6 నెలల నుంచి ఈ తెగులు వ్యాపిస్తోందని, చెట్టు మొదలు నుంచి కొమ్మలవరకు తెల్లపొడ లాగా చెట్టు పైభాగం వరకు పాకుతోందని, దీంతో చీనీ చెట్లను కొట్టివేయాల్సిన దుస్థితి ఏర్పడుతోందని రైతులు అంటున్నారు. మండలంలోని ఒక్క కొసినేపల్లె గ్రామంలోనే సుమారు 50 ఎకరాలలో సాగులో వున్న చీనీ చెట్లకు అధికశాతం ఈ తెల్లపొడ అంటుకుందని, దీంతో చెట్లు చనిపోతున్నాయని రైతులు తెలిపారు. అధికశాతం మంది రైతులు ఈ తెగులుతో చెట్లను పీకివేస్తున్నారని, అధికారులు స్పందించి ఈ తెల్లపొడకు నివారణ చర్యలు చేపట్టి చీనీ చెట్లను రక్షించాలని చీనీ రైతులు కోరతున్నారు.

తెల్ల పొడ వ్యాప్తితో చెట్లను పీకివేస్తున్నాము



చీనీ చెట్లకు తెల్లపొడలాగా చెట్టంతా పాకుతోంది. దీంతో చెట్టు ఎండుదశకు చేరుకుంటోంది. చేసేదేమీ లేక చెట్టను పీకివేస్తున్నాము. మా గ్రామంలోనే అధికశాతం చెట్లకు ఈ తెగులు సోకింది. ఇప్పటికే చాలా చెట్లు పీకివేశాము. తెగులు వ్యాప్తిని అరికట్టాలి.

– ప్రణీత్‌రెడ్డి, రైతు, కొసినేపల్లె

తెల్లటిపొడతో ఆర్థికంగా నష్టం



నేను సుమారు 10 ఎకరాల్లో చీనీ చెట్లు సాగుచేశాను. ప్రస్తుతం కాయలు చేతికొచ్చాయి. చెట్లకు తెల్లటి పొడ సోకడంతో దిగుబడి లేకపోవడంతో పాటు చెట్లు ఎండిపోతోంది. దీంతో చీనీ రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈ తెగులు నివారణపై రైతులకు అవగాహన కల్పించాలి.

– నీలకంఠారెడ్డి, రైతు, కొసినేపల్లె

పులివెందులను అభివృద్ధి చేసిన ఘనత వైఎస్ కుటుంబానిదే

పులివెందుల టౌన్ : చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు పులివెందుల అభివృద్ధికి ఎన్ని కోట్లు విడుదల చేశారో టీడీపీ నేత బిటెక్ రవి చెప్పాలని వైఎస్ఆర్సీపీ యూత్ నాయకులు వి.రామ్‌లక్ష్మణ్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ అధికారం లేకపోయినా మా నాయకులు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిల చొరవతో ఎంపీనిధులతో ఆగిన పులివెందుల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాడా నిధుల ద్వారా పులివెందులను అభివృద్ధి చేయగా.. చంద్రబాబు అది చూసి ఓర్వలేక ఇక్కడికి ప్రచారానికి వచ్చి ఇంత నిధులు పులివెందులకు అవసరమా అని వెటకారం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. పులివెందులను కొన్ని వేల కోట్లతో అభివృద్ధి చేసి చివరి 10 శాతం మిగిలిన పనులు చేయలేక పడే, పడే ప్రస్తావిస్తూ రాజకీయంగా లబ్ధి పొందుతున్నారన్నారు. పులివెందుల ప్రతిష్టను దెబ్బ తీసిన నీచ సంస్కృతి బిటెక్ రవిదేనని విమర్శించారు. పులివెందులలో మిగిలిన 5 శాతం యూజీడీ పనులు, వాటర్ గ్రిడ్ పనులు, స్మశాన వాటిక పూర్తి చేయడానికి అవసరమైన నిధులు ఈ 9 నెలల్లో ఎంత మేర నిధులు పులివెందులకు తెప్పించారో బీటెక్ రవి చెప్పాలన్నారు. ఇక పులివెందుల అభివృద్ధి ఎవరి హయాంలో జరిగిందనేది చిన్న పిల్లాడిని అడిగిన చెబుతారని, కవ్వింపు చర్యలు మానుకొని అభివృద్ధి కొనసాగించడం నేర్చుకోవాలని హితవు పలికారు.

నూగు కట్టె దగ్ధం



ఎర్రగుడిపాడు వంతెనపై దగ్ధమవుతున్న నూగు కట్టె

కమలాపురం : మండలంలోని ఎర్రగుడిపాడు పాగేరు వంతెన పై ఉన్న నూగు కట్టె దగ్ధమైంది. నూగు పంట సాగు చేసిన కొందరు రైతులు తమ పంట దిగుబడులను వంతెనపై వేసి నూర్పిళ్లు చేసుకున్నారు. నూగు దిగుబడులు తీసుకెళ్లిన రైతులు కట్టెను అక్కడే వదిలేసి వెళ్లారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం నూగు కట్టె దగ్ధమైంది. ఎవరైన నిప్పు పెట్టారో? లేక బీడీ సిగరెట్ లాంటి కాల్చి పడేశారో తెలియదు గాని నూగు కట్టె కాలి దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. అయితే ఇలా పంట నూర్పిళ్లు వంతెనపై చేయడం వలన ప్రయాణీకుల రాకపోకలకు ఇబ్బంది కలగడంతో పాటు ప్రస్తుతం నూగు కట్టె దగ్ధమైన కారణంగా వంతెనకు కూడా ప్రమాదం అని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇకపై వంతెన మీద పంట నూర్పిళ్లు చేయకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రకృతి ఉత్పత్తులకు విశేష స్పందన



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులవలన కలిగే లాబాల గురించి వివరిస్తున్న వైద్యులు

వీరపునాయునిపల్లె : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు విశేష స్పందన లభించింది. మంగళవారం ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ కుమార్ ఆదేశాల మేరకు ఉత్పత్తుల ప్రదర్శనను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు మహ్మద్ తాహా, ఖాదర్ బాషా పాల్గొని మాట్లాడారు. మండలంలోని పలు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పండ్లు, కూరగాయలు, ఆకు కూరలతో పాటు వ్యాల్యూ అడిషన్ ఉత్పత్తుల ప్రదర్శనను ఆసుపత్రిలో ఏర్పాటు చేయడం అభినందనలు తెలియజేశారు. ప్రతి ఒక్కరూ ప్రకృతి ఉత్పత్తులను వాడటం అలవాటు చేసుకోవాలన్నారు. బహిరంగ మార్కెట్‌లో దొరికే కూరగాయలు తినడం వలన ఆరోగ్యం పాడవుతుందని ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన వాటిని తినడంవలన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని నిర్వాహకులు ఆసుపత్రికి వచ్చిన రోగులకు వివరించారు. స్థానికులు కూరగాయలను ఎంతో ఉత్సాహంగా కొనుగోలు చేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ఎంటి వెంకటరామిరెడ్డి, ఆసుపత్రి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కౌన్సిలర్‌కు టీడీపీ భారీ నజరానా

పులివెందుల టౌన్ : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని 30వ వార్డు కౌన్సిలర్ షాహిదా మంగళవారం ఆ వార్డు టీడీపీ నాయకులు తూగుట్ల మధు ఆధ్వర్యంలో టీడీపీ కండువా వేసుకుని పార్టీలో చేరింది. ఇందుకు సంబంధించి ఆ కౌన్సిలర్ వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేసి గెలిచి 5 ఏళ్లు పార్టీలో ఉండి పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొంది. ఇప్పుడేమో భారీనజరానాకు ఆశపడి టీడీపీ తీర్థం పుచ్చుకోవడంపట్ల పలువురు బహిరంగంగా విమర్శలు గుప్పిస్తున్నారు.

విశిష్ట గుర్తింపు సంఖ్యకు నమోదు చేసుకోండి



నల్లచెరువుపల్లె ఆర్ఎస్‌కేలో గుర్తింపు సంఖ్య నమోదును పరిశీలిస్తున్న ఏఓ చెన్నారెడ్డి

వేముల : మండల వ్యాప్తంగా భూమి ఉన్న ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యకు రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని ఏఓ చెన్నారెడ్డి తెలిపారు. మండలంలోని నల్లచెరువుపల్లె రైతు భరోసా కేంద్రంలో నమోదు ప్రక్రియను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతుకు ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్యను ఇవ్వడం ద్వారా వ్యవసాయ సేవలను సులభతరం చేసి పారదర్శకంగా అందుబాటులోకి తీసుకురావడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. రైతు సేవా కేంద్రంలో రైతు రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు చేసిన తర్వాత భూమి ఉన్న ప్రతి రైతుకు కేటాయించబడే ప్రత్యేక గుర్తింపు సంఖ్య అన్నారు. ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందడానికి ఈ సంఖ్య అధికారిక గుర్తింపుగా పనిచేస్తుందన్నారు. అలాగే పీఎం కిసాన్ సమ్మాన్ నిధి చెల్లింపులు, అన్నదాత సుఖీభవ పథకం, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, వ్యవసాయ శాఖ యంత్ర సేవా పథకం, బిందు సేద్య పరికరాలు, మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు, ఆర్ఎస్‌కేల ద్వారా నేరుగా పొందే వీలుందన్నారు. నీటి పారుదల, తెగుళ్ల నియంత్రణ, వాతావరణ సూచనలు వంటి ఇతర సేవలు పొందడానికి తోడ్పడుతుందన్నారు. మండ వ్యాప్తంగా భూములు ఉన్న రైతులు ఆధార్ నెంబర్, ఆధార్ అనుసంధారిత ఫోన్ నెంబర్, భూమి పట్టాదారు పాసు పుస్తకం, ఈ మెయిల్ ఐడీ ఉన్న రైతులు గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో సిబ్బందిని సంప్రదించి గుర్తింపు సంఖ్యకు రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలన్నారు.

రోడ్డుపైకి మురికినీరు వదలవద్దు



రోడ్డుపైన ఉన్న మురికినీటిని చూసి సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ

ఎర్రగుంట్ల : రోడ్డుపైకి మురికినీరు వదలవద్దుఅని ఎంపీడీఓ వెంకటరమణయ్య తెలిపారు. మంగళవారం కలమల్ల గ్రామ సచివాలయంను ఆయన తనిఖీ సచివాలయ పరిధిలో పర్యటించారు. అక్కడ రోడ్డుపైన మురికినీరు ఉండటం గమనించి సచివాలయ ఉద్యోగులను హెచ్చరించారు. ఏవరైన రోడ్డుపైన మురికినీరు వదిలితే ఆ ఇంటి యజమానులకు నోటీసులు అందించాలన్నారు. తర్వాత సచివాలయంను తనిఖీ చేసి అక్కడ జరుగుతున్న సేవలను పరిశీలించారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



పేదలకు వైద్య సేవలు అందిస్తున్న వైద్యుడు

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక సీఎస్ఐ చర్చిలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సీఎస్ఐ చర్చి 10వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని ప్రముఖ పారిశ్రామికవేత్త వైఎస్ ప్రకాష్‌రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. సీఎస్ఐ చర్చి రాయలసీమ అధ్యక్షుడు రెవరెండ్ ఫాదర్ ఐజాకర్ వరప్రసాద్ ఆధ్వర్యంలో పేదలకు ఉచిత వైద్య సేవలు అందించారు. ఈ వైద్య శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ నేత వైఎస్ మధురెడ్డి పర్యవేక్షించారు. ఈ వైద్య శిబిరంలో కంటి జబ్బులకు ఉచితంగా ఆపరేషన్లు చేయించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు రాజ్, రవీంద్ర, సిద్దిక్, మనోజ్ రవి, సీఎస్ఐ చర్చి కార్యదర్శి కేల్‌కర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ప్రతిభ



జితేంద్ర రాయల్‌కు మెమెంటో, సర్టిఫికెట్‌ను అందిస్తున్న ప్రముఖులు

సింహాద్రిపురం : ఈనెల 9వ తేదీన విజయవాడలో విశ్వం ఎడ్యుటెక్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అబ్యాకస్ పోటీ పరీక్షల్లో శ్రీవివేకానంద పాఠశాల విద్యార్థి ప్రతిభ చూపినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ ఖాదర్‌వలి తెలిపారు. తమ పాఠశాలలో నాల్గవ తరగతి చదువుతున్న ఎ.జితేంద్ర రాయల్ జూనియర్ లెవెల్–3 విభాగంలో తృతీయ స్థానంలో నిలిచి మొమెంటో, సర్టిఫికెట్లను సాధించారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థిని కరస్పాండెంట్‌తోపాటు డైరెక్టర్ జాఫర్, హెడ్మాస్టర్ షెహనాజ్ బేగం, ఉపాధ్యాయులు అభినందించి హర్షం వ్యక్తం చేశారు.

నేడు షిర్డీసాయిబాబాకు పాలాభిషేకం

పులివెందుల టౌన్ : పట్టణంలోని పార్నపల్లె రోడ్డు సమీపంలో ఉన్న శ్రీషిర్డీసాయిబాబా ఆలయంలో మంగళవారం మాఘశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీషిర్డీసాయిబాబాకు 108 బిందెల పాలాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త శ్రీరామసుబ్బయ్య తెలిపారు. తెల్లవారుజామున 5 గంటల నుంచి 10 గంటల వరకు జరిగే పాలాభిషేకంలో భక్తులు పాల్గొనాలన్నారు. హోమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య



కొర్ర పంటను పరిశీలిస్తున్న ఏఓ సరస్వతి

కమలాపురం : ప్రతి రైతుకు ప్రభుత్వం ఆధార్ కార్డులాగా 14 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయిస్తున్నట్లు మండల ఏఓ సరస్వతి తెలిపారు. మంగళవారం మండలంలోని ఎర్రగుడిపాడు, పందిళ్లపల్లె గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని పూర్తిగా అధునీకరించడానికి కేంద్ర ప్రభుత్వం రైతులకు 14 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్యను ఆధార్ కా ర్డు తరహాలో అందించనుందన్నారు. ఇకపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు రైతులకు అందాలంటే విశిష్ట గుర్తింపు సంఖ్య ఉన్న కార్డులు తప్పని సరి అవుతాయన్నారు. రైతులందరూ తమ పరిధిలోని ఆర్ఎస్‌కేలకు వెళ్లి వీఏఏలను కలసి తమ పట్టాదారు పాసు పుస్తకాలు, లేదా 1బి, అడంగల్, ఆధార్ కార్డు జిరాక్స్, ఆధార్ కార్డుకు లింక్ అయిన ఫోన్‌ను తీసుకెళ్లి నమోదు చేసుకోవాలన్నారు. అలాగే ఇ-పంట నమోదు చేసుకున్న ప్రతి రైతు ఇ-కేవైసీ తప్పని సరిగా నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం క్షేత్రస్థాయిలో కొర్ర పంటను పరిశీలించి, ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. వీఏఏ సతీష్, రైతులు పాల్గొన్నారు.

అర్చకునిపై దాడి అమానుషం



నోటికి నల్ల రిబ్బన్ కట్టుకుని నిరసన తెలుపుతున్న అఖిల భారత బ్రాహ్మణ సంఘ నాయకులు

వేంపల్లె : సమాజ హితమే ధ్యేయంగా సనాతన ధర్మమే ఊపిరిగా పనిచేస్తున్న అర్చకులపై దాడి చేయడం అమానుషమని అఖిల భారత బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ అన్నారు. వేంపల్లెలోని స్థానిక శ్రీవాసవీ కల్యాణ మండపంలో హిందూ సంఘాలతో కలిసి నోటికి నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రం చిలకూరి బాలాజి ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. ఈ దేశంలో సనాతన ధర్మాన్ని కాపాడడమే ధ్యేయంగా పని చేస్తూ మన సంస్కృతి, సంప్రదాయాలను సమాజంలోనికి తీసుకెళ్తున్న అర్చకులను అసభ్య పదజాలంతో దూషించి దాడి చేసిన రామరాజ్యం వ్యవస్థాపకులు వీర రాఘవరెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకుని అతన్ని అరెస్టు చేయాలన్నారు. సనాతన హిందూ ధర్మం నిలబడాలంటే బ్రాహ్మిన్ అట్రాసిటీ చట్టం తీసుకురావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సమాజంలో ఇటువంటి ఘటనలు జరుగుతున్నప్పుడు అక్కడున్నటువంటి ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇలాగే చూస్తూ ఉంటే మన సంస్కృతి మీద, ధర్మం మీద దాడి జరిగే ప్రమాదం ఉందన్నారు. ఏపీలో హిందువులను ఏకం చేస్తూ నిర్వహించిన హైందవ శంఖారావం విజయవంతమైనప్పటికీ ఇలాంటి ఘటనలు జరగడం చాలా బాధాకరమన్నారు. కార్యక్రమంలో అర్చకులు ప్రసాద్ శర్మ, మురళి, భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షురాలు సుష్మా, బీజేపీ నాయకులు, విశ్వ హిందూ పరుషత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా కొండలో మట్టి తవ్వకాలు



కొండలో యంత్రాలతో అక్రమ తవ్వకాలు



మట్టి తవ్వకాలతో ధ్వంసమైన కొండప్రాంతం

ముద్దనూరు : మండలంలోని ఉప్పలూరు రెవెన్యూ పరిధిలోని కాండ్లోపల్లె సమీపంలో కానలో యథేచ్ఛగా అక్రమ మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. కాండ్లోపల్లె క్రాస్ నుంచి కానలోకి వెళ్ళే రహదారి పక్కలో కొండను యంత్రాలతో తవ్వి ట్రిప్పర్లతో మట్టిని రవాణా చేస్తున్నారు. 4 రోజుల నుంచి కాన సమీపంలోని కొండను ధ్వంసం చేస్తున్నారు. స్థానిక రైతులు మాత్రమే ఈ కొండలోని సుద్దను తీసుకెళ్ళడానికి అనుమతులున్నట్లు రైతులు తెలిపారు. ముద్దనూరు–ఉప్పలూరు ప్రధాన రహదారి పక్కనే భారీ యంత్రాలు, ట్రిప్పర్లతో ఈ తతంగం జరుగుతున్నా సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఈ కొండ సమీపంలోనే పురాతన శివాలయం, చెరువు వుందని దీనికి తోడు ఆలయం వద్దకు నిర్మించిన రహదారిలో భారీ వాహనాలు సంచరించడంతో రహదారి నాశనమైందని స్థానికులు వాపోతున్నారు. మండలంలో అధికార కూటమికి చెందిన ఓ నాయకుడి అండతోనే ఈ కొండలో తవ్వకాలు చేపట్టారని సమాచారం.

భారతమాత ముద్దు బిడ్డ దీనదయాల్ ఉపాధ్యాయ



దీనదయాల్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

వేంపల్లె : భారతీయ జనతా పార్టీ సిద్ధాంత కర్త పండిట్ దీనదయాల్ ఉపాధ్యాయ అని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక బీజేపీ నాయకులు చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించి మాట్లాడారు. ఏకాత్మ మానవతా వాదం, అంత్యోదయను బీజేపీకి అందించిన మహానీయుడు, మానవతా వాది, తత్వవేత్త, జ్ఞాని దీందయాల్ ఉపాధ్యాయ అని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు సుష్మా, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి, బీజేపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు దొంతు సుమన్ కుమార్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సునీల్ కుమార్, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కమ్ముకున్న పొగ మంచు



వల్లూరు మండలంలో కమ్ముకున్న పొగ మంచు

వల్లూరు : మండలంలో మంగళవారం తెల్లవారుజామున పొగ మంచు కమ్ముకుంది. తెల్లవారుజామున సుమారు 5 గంటల నుండి ఉదయం 8:30 వరకు పొగ మంచు దట్టంగా అలుముకుంది. పొగ మంచు కారణంగా ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పూత, పిందె దశలో వున్న మామిడి తోటలకు ఈ పొగ మంచు వల్ల నష్టం వాటిల్లే అవకాశం వుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతోపాటు పొట్ట, వెన్ను దశలో వున్న వరి పైరుకు సైతం నష్టం వాటిల్లే అవకాశం వుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

తప్పులు లేకుండా రీసర్వే చేయాలి



రీసర్వేను పరిశీలిస్తున్న కడప ఆర్‌డీఓ జాన్ ఎర్విన్

కమలాపురం : రైతుల సహకారంతో ఏలాంటి తప్పులు లేకుండా రీసర్వే పూర్తి చేయాలని కడప ఆర్‌డీఓ జాన్ ఎర్విన్ తెలిపారు. మంగళవారం భూ రీసర్వే పైలెట్ ప్రాజెక్ట్ గ్రామమైన అప్పారావుపల్లిలో జరుగుతున్న రీసర్వేను ఆయన పరిశీలించి సంబంధించిన రికార్డులను పరిశీలించి సర్వేయర్‌ను, రీ సర్వే డీటీ, విలేజ్ సర్వేయర్‌లకు తగిన సలహాలు, సూచనలు జారీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూ రీసర్వే ఏలాంటి తప్పులు లేకుండా పక్కాగా చేయాలన్నారు. అలాగే రైతుల సహకారం తీసుకుని త్వరితగతిన రీసర్వే పూర్తి చేయాలన్నారు. రైతుల నుంచి తిరిగి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరామిరెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలను పాటించాలి

పులివెందుల రూరల్ : ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బీవీ ప్రసాద్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని స్థానిక ఎంవీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 36వ జాతీయ భద్రతా వారోత్సవాల సందర్భంగా 10 రోజుల నుంచి ఆటో డ్రైవర్లు, లారీ డ్రైవర్లు, విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈ వారోత్సవాలను డీఎస్పీ మురళీ నాయక్, అర్బన్ సీఐ నరసింహులు, ట్రాఫిక్ సీఐ హాజివలి సహకారంతో విజయవంతం చేశామన్నారు. అధికారులు చెప్పిన సూచనలు, సలహాలను డ్రైవర్లు, వాహనదారులు, విద్యార్థులు తప్పనిసరిగా పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలన్నారు.